పేదల జీవితాల్లో వెలుగులు



ఆమదాలవలస: సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

ఆమదాలవలస: పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపాల్టీ పరిధిలో తిమ్మాపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ, ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన లబ్ధిదారులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికపరమైన కారణాలతో అర్హులైన లబ్ధిదారులు సంక్షేమానికి దూరం కాకుండా చూడాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల చెంతకు చేరువ చేయడానికి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ఉందనే విశ్వాసాన్ని ప్రజల్లో నిరంతరం పెంపొందించడానికి కృషి చేయాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, బొడ్డేపల్లి అంజంతాకుమారి, సంపతిరావు రామారావు, మెట్ట చక్రధరరావు, కిల్లి అప్పలనాయుడు, కిల్లి చంద్రరావు, సంపతిరావు అరుణ్‌కుమార్, హనుమంతు రాము, కూర్మాన రాము, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లు

జలుమూరు: సంక్షేమం..అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పర్లాం పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలు వివరించారు. సర్పంచ్ తాడేల త్రినాథ్ మాట్లాడుతూ.. గ్రామంలో పలువురు అర్హులున్నారని, వారికి జగనన్న ఇళ్లు, పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ఈ సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు. ఎంపీపీ వాన గోపి, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షులు పి.ముసలినాయుడు, రాజప్పల నాయుడు, పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కనుసు సీతారాం, వైస్‌ఎంపీపీ తంగి మురళీకృష్ణ, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, ఎంపీటీసీ వెలమల అసిరినాయుడు, పైడి విఠలరావు, బుక్కా లక్ష్మణరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మథరావు, ఎం.శ్యామలరావు, వాన నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు

నేడు బొడ్డపాడులో..

బొడ్డపాడులో బుధవారం సాయంత్రం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నామని ఎంపీపీ వాన గోపి, సర్పంచ్ అంపోలు భాను మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అన్ని విభాగాల నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



జలుమూరు: సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

బూర్జ: మండలంలోని పెద్దపేట పంచాయతీ మధనాపురం గ్రామంలో గల శివకేశవ క్షేత్రంలో శివపార్వతుల కల్యాణాన్ని ప్రధాన అర్చకులు నేతేటి శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. 6వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి పౌరాణిక నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



జాస్మిన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రేణుకేశ్వరరావు

మెళియాపుట్టి: మండలంలోని పెద్దమడి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల విద్యార్థి రాష్ట్ర స్థాయిలో పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఇటీవల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించారు. కళాశాలకు చెందిన ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం ఎంపీసీ చదువుతున్న సవర జాస్మిన్ ట్రిపుల్ జంప్, లాంగ్ జంప్‌లలో రెండు సిల్వర్ మెడల్స్‌ను కైవసం చేసుకున్నాడు. మంగళవారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ కె.రేణుకేశ్వరరావు జాస్మిన్, పీడీ వినోదిను అభినందించారు. ఉప ప్రధానోపాధ్యాయులు ఆర్.ఎస్.వి.జి.క్రిష్ణారావు, సిబ్బంది ఉన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

నరసన్నపేట: మేజరు పంచాయతీలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ బూరల్లి శంకర్ అన్నారు. మంగళవారం దేవాది వద్ద మరమ్మతుకు గురైన నీటి పంపులను వెంటనే మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గడిచిన రెండు రోజులుగా దేవాది వద్ద ఒక పంపులైన్ మరమ్మతుకు గురి కావడంతో కొన్ని వీధులకు నీటి సరఫరాలో ఇబ్బంది ఎదురైందని, వెంటనే గమనించి పైపులైన్ మరమ్మతును గుర్తించి పనులు చేయించినట్లు తెలిపారు. బుధవారం ఉదయం నుంచీ నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది ఉండదని, అన్ని వీధులకు నీరు వస్తుందన్నారు. వార్డు సభ్యులు పి.కృష్ణ ప్రసాద్, రఘుపాత్రుని శ్రీధర్ తదితరులు ఉన్నారు.


చురుగ్గా ఈ-పంట నమోదు



ఈ-పంట నమోదు చేస్తున్న సిబ్బంది

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు గ్రామాల్లో ఈ-పంట నమోదు ప్రక్రియ చురుగ్గా నిర్వహిస్తున్నారు. రబీలో సాగు చేస్తున్న వరి, అపరాల పంటలైన పెసర, మినుముతోపాటు మొక్కజొన్న ఇతర వాణిజ్య పంటలను గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకుల ద్వారా ఈ పంట నమోదు చేస్తున్నామని ఏఓ పైడి లతశ్రీ చెప్పారు. ఈ-పంట నమోదు చేసుకోవటం వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. పంట అమ్ముకునేందుకు, ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం, బీమా పొందేందుకు రైతులకు ఉపయోగపడుతుందన్నారు.

కొత్తూరు పీఏసీఎస్ చైర్మన్‌గా సూర్యనారాయణ



కొత్తూరు: మండలం పీఏసీఎస్ చైర్మన్‌గా చింతాడ సూర్యనారాయణను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులను స్థానిక పీఏసీఎస్ కార్యాలయానికి మంగళవారం చేరాయి. డైరెక్టర్‌లుగా పారాపురం గ్రామానికి చెందిన కుంచాల నూకరాజు, మాకవరం గ్రామానికి చెందిన గార రాజులునాయుడును నియమించినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. చైర్మన్‌గా సూర్యనారాయణను మూడోసారి ప్రభుత్వం నియమించింది. చైర్మన్‌గా మూడుసార్లు నియమాకం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతికి సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీ సకాలంలో సంఘం ద్వారా ఈ ఏడాది చర్యలు తీసుకున్నామన్నారు. ఎమ్మెల్యే చొరవతో సంఘం అభివృద్ధికి మరింత కృషి చేస్తానని సూర్యనారాయణ తెలిపారు.

లోకేష్‌కు రాష్ట్రంపై అవగాహన లేదు

- తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్



మాట్లాడుతున్న మామిడి శ్రీకాంత్

మెళియాపుట్టి: పాదయాత్ర చేయాలంటే రాష్ట్రం కోసం పూర్తిస్థాయి అవగాహన ఉండాలని రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన మెళియాపుట్టిలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పేద, బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలు ప్రతీఒక్కరూ సంతోషంగా ఉన్నారన్నారు. యువగళం పాదయాత్ర ద్వారా లోకేష్ ప్రజలకు ఏం చెప్పదలచుకున్నారని ప్రశ్నించారు. ఇలాంటి పాదయాత్రలు ఎన్ని చేసినా ప్రజలు తెలుగుదేశం పార్టీని విశ్వసించరన్నారు. స్పష్టత లేని పాదయాత్రచేసి ఏం సాధిస్తారన్నారు. లోకేష్‌కు మాట్లాడే విధానాన్ని నేర్పించడాన్ని 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు మరిచారని, లోకేష్‌ను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాలు బాగున్నాయని చెప్తారా? బాగులేవని చెప్పదలచుకున్నారా అనేది లోకేష్‌కే తెలియాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో పథకాలకు సంబంధించిన డబ్బులు నేరుగా అకౌంట్లలో వేస్తున్నామన్నారు. పాదయాత్రలో జనాలే లేకుండా రోజువారీ జీతాలిచ్చి తెచ్చుకున్న 150 మంది మాత్రమే కనబడుతున్నారన్నారు. ముఖ్యమంత్రిపై విమర్శలు చేసేముందు ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. టీడీపీ నాయకులకు ప్రజలు ఏవిధంగా సమాధానం చెప్పాలో అదేవిధంగా చేప్తారన్నారు. వైస్ ఎంపీపీ ఆదినాయుడు, బాణాపురం సర్పంచ్ పి.చంద్ర, ఉర్లాన రుషి, రేఖాన వాసు, జి.చిన్నారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వేతనాలు తక్కువ వస్తే సిబ్బందిపై చర్యలు

- డ్వామా పీడీ చిట్టిరాజు



బొరిగివలసలో వేతనదారులకు సూచనలిస్తున్న పీడీ చిట్టిరాజు

నరసన్నపేట: ఉపాధి వేతనదారులు రోజుకు రెండు పూటలా 6 గంటలకు తక్కువ లేకుండా పనిచేయాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు సూచించారు. వేతనదారులకు కనీస వేతనం రూ.250 కంటే తక్కువ వేతనం వచ్చే చోట్ల సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. బొరిగివలసలో వెంకన్న ట్యాంకు, జమ్ము పంచాయతీ శివరాంపురంలో శివరాంపురం ట్యాంకులో ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. వేతనదారులకు ఎన్ని సూచనలు చేస్తున్నా ఇప్పటికీ అనేక చోట్ల కనీస వేతనం రూ.200 దాటడం లేదన్నారు. ప్రతీ వేతనదారుడు రూ.250 పొందాలని, ఈ విధంగా తగిన కొలతలు ఇచ్చే బాధ్యత ఫీల్డ్‌అసిస్టెంట్లుదేనని అన్నారు. టెక్నికల్ అసిస్టెంట్లు క్రమం తప్పకుండా తనిఖీలు చేసి వేతనాలు పెరిగేలా చూడాలన్నారు. వాటర్‌షెడ్ ఏపీడీ మెండ జయరాం, ఉపాధి ఏపీడీ యుగంధర్, ఉపాధి మండల ఇంజినీర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వేతో సమస్యల పరిష్కారం

కొత్తూరు: ప్రభుత్వం నిర్వహిస్తున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూమి హక్కు సమగ్ర భూ రీ సర్వేతో దీర్ఘకాలం నుంచి వస్తున్న సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. మండలంలోని పారాపురం గ్రామంలో సర్పంచ్ కుంచాల రత్నాలు అధ్యక్షతన గ్రామ సభను సర్వేయర్ అల్లు తిరుపతిరావు, వీఆర్వో నారాయణరావు మంగళవారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ వంద ఏళ్ల తరువాత నిర్వహిస్తున్న భూముల రీ సర్వేను రైతులు వినియోగించుకోవాలన్నారు. రీ సర్వే బృందాలకు రైతులు సహకరించాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నందకుమార్, ఎంపీటీసీ సభ్యుడు వనుము లక్ష్మీనారాయణ, తోట కిరణ్ కుమార్, జి.రామారావు, ఆర్‌సీడీటీ వెంకటరావు, మండల సర్వేయర్ ఎన్.వి.రమణయ్య, సర్వేయర్ అల్లు తిరుపతిరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

పాతపట్నం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు సకాలంలో అందించాలని గ్రామ వలంటీర్లకు వైస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, ఈఓపీఆర్డీ ఎన్.ప్రసాద్ పండా సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పాతపట్నం మేజర్ పంచాయతీ గ్రామ వలంటీర్లతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ తన పరిధిలోని కుటుంబాలకు అర్హత ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలన్నారు. ఈఓ కుర్మారావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ఆన్‌లైన్ సర్వేను తప్పనిసరిగా చేయాలన్నారు. ఔట్ రిచ్ సర్వేలో జిల్లాలో పాతపట్నం 1, 2, 3 గ్రామ సచివాలయాలు వెనుకబడి ఉన్నాయన్నారు. ఏఓ కె.అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, వీఆర్వోలు బాలరాజు, పార్థసారధి పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేయండి

- స్పీకర్ తమ్మినేని సీతారాం



అంగన్‌వాడీ నియామకపత్రాలు అందజేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: అంగన్‌వాడీ పోస్టులు పొందిన ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాలకు అనుగుణంగా బాధ్యతతో పనిచేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. పట్టణంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలో వివిధ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులకు నియామకాలు జరపడంతో వారికి నియామకపత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది విధి నిర్వహణ సక్రమంగా నిర్వహించడంతోపాటు చిన్నారులకు రక్షణగా నిలవాలని సూచించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలన్నారు.

భగవద్గీత సారాంశాన్ని గుర్తించాలి



కొత్తకోటలో ధర్మప్రచారం చేస్తున్న ప్రచార కమిటీ సభ్యులు

సరుబుజ్జిలి: భవగద్గీతలోని సారాంశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ప్రబోధ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సంతోష్‌కుమార్ తెలిపారు. మంగళవారం నక్కలపేట, కొత్తకోట గ్రామాల్లో హిందూ ధర్మప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ కరపత్రాలు అందించారు. కార్యవర్గ సభ్యులు దుర్గారావు, పుండరీకాక్ష, ఈశ్వర్, వెంకటరావు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నేడు శ్రీముఖలింగంలో విశ్వశాంతి హోమం



హోమానికి సిద్ధం చేసిన వేదిక

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం ఒరియా వీధిలో భీష్మ ఏకాదశి పురస్కరించుకుని మంగళవారం కళాశిదివాసం, అఖండ నామసంకీర్తన, వహీమంత్ర జపం నిర్వహించారు. బుధవారం విశ్వశాంతి హోమం, అఖండ నామ యజ్ఞం, సూర్యపూజ, భగవద్గీత హోమం, రాత్రికి విష్ణు సహస్రనామం ఉంటాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు. గురువారం కూడా పలు పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

83 మందికి కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న జానకిరామయ్య

కొత్తూరు: మండలంలోని కురిగాం పీహెచ్‌సీ పరిధి దిమిలి గ్రామంలో మంగళవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. 83 మందికి కంటి పరీక్షలను స్థానిక పారామెడికల్ ఆఫ్తాలమిక్ ఆఫీసర్ ఇప్పిలి జానకిరామయ్య నిర్వహించారు. 31 మందికి దృష్టిలోపం, 34 మందికి ఇతర సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. మందులు పంపిణీ చేశారు. శ్రీకాకుళంలోని రిమ్స్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేస్తారన్నారు. ఎంపీటీసీ కలవమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు దారపు శ్రీరామకృష్ణ, వైద్య సిబ్బంది సవరమ్మ, ఈశ్వరరావు, స్వర్ణలత, ఆశ వర్కర్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కలమట వేధింపులు సరికాదు'

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పాతపట్నం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి కలమట వెంకటరమణ వేధింపులు సరికాదని పదవి నుంచి తొలగింపునకు గురైన ఎల్.ఎన్.పేట మండల శాఖ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు, యంబరాం సర్పంచ్ వెలమల గోవిందరావు అన్నారు. శ్రీకాకుళంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పార్టీ మారినప్పుడు తన వెంట వెళ్లలేదన్న అక్కసుతోనే తమపై పార్టీ వ్యతిరేకులమని ముద్రవేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



భూములను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

హిరమండలం: సాగు భూములను సాగేతర భూములుగా మార్చే ప్రక్రియలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని టెక్కలి డివిజన్ సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం తంప, చొర్లంగి, కోరాడ రెవెన్యూ పరిధిలో సాగు భూములను సాగేతర భూములుగా మార్చేందుకు కొంతమంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆ భూములను సబ్ కలెక్టర్ పరిశీలించారు. అయితే కొన్నిచోట్ల నిబంధనలు పాటించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. దరఖాస్తు ప్రక్రియను పునర్ పరిశీలించాలన్నారు. లోపాలను సవరించాలన్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భూమి ప్లాన్, ఎందుకు సాగేతర భూములుగా మార్చుకున్నారో వివరంగా పొందుపరచాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుము తప్పనిసరిగా చెల్లించాలన్నారు. అనంతరం మర్రిగూడ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. సబ్ కలెక్టర్ కొద్దిసేపు ఉపాధ్యాయుడి అవతారమెత్తారు. విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేశారు. ఉత్తమ విద్యాబోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం అంతిలి రెవెన్యూ పరిధిలోని భూ రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. సర్వే పారదర్శకంగా జరపాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మురళీమోహన్, డీటీ వెంకటరమణ, సర్వేయర్ శ్యామలరావు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాల్లో అలసత్వం తగదు

- స్పీకర్ తమ్మినేని సీతారాం



సూచనలిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: మున్సిపాల్టీ పరిధిలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు, మున్సిపాల్టీ పరిధిలో చేపడుతున్న తాగునీటి పనులపై సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. టిడ్కో ఇళ్ల నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నందున అధికారుల అలసత్వంపై మండిపడ్డారు. అధికారుల తీరు వల్ల లక్ష్యానికి దూరం అవుతున్నామని, అలసత్వం విడనాడి త్వరితగతిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలు, తాగునీటి కల్పన, అంతర్గత కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణాలు ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యంతో పేదలకు గృహ నిర్మాణం కల్పించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా పనుల నిర్మాణాలు వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. మున్సిపాల్టీ పరిధిలో చేపడుతున్న తాగునీటి పనుల నిర్మాణాలను ఇప్పటి వరకు ప్రారంభించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న వేసవి కాలానికి తాగునీటి సమస్య లేకుండా పనులు సత్వరమే పూర్తి చేయాలని సూచించారు. టిడ్కో శాఖ ఏఎస్ఈ నరసింహమూర్తి, పబ్లిక్ హెల్త్ ఈఈ సుగుణకరరావు, కమిషనర్ అప్పలనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంచార పశు వైద్య సేవలు



పశు ఆరోగ్య సేవ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సవర సావిత్రి

కొత్తూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నూతనంగా అమలు చేసిన డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలను రైతులు వినియోగించుకోవాలని ఎంపీపీ సరవ సావిత్రి అన్నారు. కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట మండలాలకు ప్రభుత్వం కేటాయించిన సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్‌ను మంగళవారం కొత్తూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సావిత్రి, వైస్ ఎంపీపీ తులసీవరప్రసాదరావు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పశువులు వ్యాధుల బారిన పడితే చికిత్స కోసం దూర ప్రాంతాల్లోని పశువైద్యశాలలకు తీసుకుని వెళ్లి వ్యయ ప్రయాసలు పడేవారన్నారు. మూగ జీవాలకు సకాలంలో వైద్యం అందించేందుకు ఈ వాహనాలు ఎంతో ఉపయోగాపడతాయన్నారు. స్థానిక పశువైద్యాధికారి జి.నారాయణరావ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

ఆమదాలవలస: సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నూతనంగా నియామకమైన సచివాలయ మండల కో ఆర్డినేటర్లు పనిచేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం మండల కో ఆర్డినేటర్లను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేసినట్లు ఆయన తెలియజేశారు. ఆమదాలవలస మండల కో ఆర్డినేటర్‌గా బొడ్డేపల్లి నిరంజన్, మున్సిపాల్టీ కో ఆర్డినేటర్‌గా అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, సరుబుజ్జిలి మండల కో ఆర్డినేటర్‌గా మూడడ్ల రమణ, పొందూరు మండల కో ఆర్డినేటర్‌గా బాడాన కృష్ణ, బూర్జ మండల కో ఆర్డినేటర్‌గా గుమ్మడి రాంబాబులను నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆశయాలు, ఆలోచనలను ప్రతీ గడపకు వెళ్లి ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో ప్రతి సచివాలయ వలంటీర్ పరిధిలో ఇద్దరు గృహసారథులు, వీరిని సమన్వయం చేసేందుకు సచివాలయ కన్వీనర్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. మండలంలో అన్ని సచివాలయ కన్వీనర్లను సమన్వయం చేసేందుకు మండల కో ఆర్డినేటర్లను నియమించినట్లు పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికయిన మండల కో ఆర్డినేటర్లకు చిరంజీవినాగ్ శుభాకాంక్షలు తెలియజేశారు.

సంక్షిప్తంగా..

దాడిలో ఒకరికి గాయాలు

సారవకోట: మండలంలోని పెద్దలంబ గ్రామానికి చెందిన మల్లారపు భద్రయ్యపై అదే గ్రామానికి చెందిన వండాన నాగరాజు దాడి చేసి గాయపర్చినట్లు మంగళవారం సారవకోట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. కులం పేరుతో దూషించడంతో పాటు దాడి చేయడంతో తలపై తీవ్ర గాయమైంది. సోమవారం చిట్ ఫండ్ విషయంలో జరిగిన తగాదాలో తనను కులం పేరుతో దూషించి గాయపర్చినట్లు భద్రయ్య ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ అప్పారావు తెలిపారు.

లెప్రసీపై అవగాహన

మెళియాపుట్టి: కుష్టు వ్యాధికి నివారణ ఒక్కటే మార్గమని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ అలేఖ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు లెప్రసీపై అవగాహన కల్పించారు. దీనిపై ప్రతీఒక్కరూ విద్యార్థి దశలోనే అవగాహన కలిగి ఉండాలని అవగాహనే నివారణకు మార్గమని, ఈ వ్యాధి సోకిన వారిలో నాడీవ్యవస్థ, కాళ్లు, చేతులపై ప్రభావం ఉంటుందన్నారు. ముందుజాగ్రత్తలు పాటిస్తే పూర్తిగా నయం చేయవచ్చునన్నారు. సూపర్‌వైజర్ నాగభూషణం, ఏఎన్ఎం సుజాత, ఆశ కార్యకర్తలు, పలువురు ఆరోగ్యశాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీ

పొందూరు: సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం పొందూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పోస్టులు నియామకం చేపట్టినట్లు మంగళవారం సీడీపీఓ ఎస్.రూపలత తెలిపారు. పొందూరు మండలంలోని లక్ష్మీపురం, నందివాడ అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలను, కింతలి-1, రాపాక-1, వీఆర్ గైడెంలో సహాయకులను, జి.సిగడాం మండలంలోని గేదలపేటలో సహాయకురాలిని నియమించినట్లు పేర్కొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులను భర్తీచేసి, వారందరికీ స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం నియామక పత్రాలు అందించినట్లు ఆమదాలవలస ఐసీడీఎస్ పీఓ బాలామణి తెలిపారు. పురుషోత్తపురం, ఇస్కలపాలెం గ్రామాల్లో హెల్పర్లు, సింధువాడలో కార్యకర్త పోస్టును నియమించినట్లు వెల్లడించారు.

96 మద్యం బాటిళ్ల పట్టివేత

మెళియాపుట్టి: మండలంలోని వసుంధర గ్రామ సరిహద్దుల్లోని చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ పోలీసులు మంగళవారం 96 మద్యం బాటిళ్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఓ ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళ్తూ ఉండటంతో వెంబడించి నడసంద్ర గ్రామం వద్ద పట్టుకున్నారు. వీరు టెక్కలి మండలం రావివలస గ్రామానికి చెందిన వ్యక్తులని పోలీసులు తెలిపారు. వారిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించనున్నట్లు టెక్కలి ఎస్ఈబీ సీఐ అనిల్ కుమార్ తెలిపారు. ఇటీవల ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో పూర్తిస్థాయి నిఘా పెట్టినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో జిల్లా అడిషనల్ ఎస్పీ బృందం, టెక్కలి ఎస్ఈబీ బృందం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అఖండనామ సంకీర్తన

బూర్జ: మండలంలోని లక్కుపురం గ్రామ రామాలయం వద్ద మేలుకొలుపు విజయోత్సవ కార్యక్రమం ఆలయ అర్చకులు రంప రామశర్మ అధ్యక్షతన నిర్వహించారు. మంగళవారం సాయంత్రం 6 నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు విఘ్నేశ్వర భజన భక్త బృందం, గ్రామస్తులు తెలియజేశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో వివిధ గ్రామాల నుంచి హాజరుకానున్న భజన బృందాలతో ఏకాహం (అఖండ నామ సంకీర్తన) నిర్వహిస్తున్నారు. అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర గ్రామాల భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు రంగనాథుని తిరుకల్యాణం

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామంలో గల రంగనాథస్వామి దివ్య తిరుకల్యాణం వేదపండితులు శ్రీనివాసరామానుజస్వామి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు అర్చకులు సనపల యతిరాజుదాసు మంగళవారం ప్రకటించారు. అనంతరం స్వామివారి తిరువీధి, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పేదలకు పండ్ల పంపిణీ

ఆమదాలవలస: పట్టణంలోని మేదర వీధి, లెప్రసీ కాలనీల్లో ఉన్న పేదలకు సింహంభట్ల ప్రసాద్ పంతులు ఆధ్వర్యంలో మంగళవారం పండ్లను పంపిణీ చేశారు. మాఘమాసం సందర్భంగా పేదలను ఆదుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. పేదలకు సేవ చేయడంలోనే సంతృప్తి ఉంటుందన్నారు. పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలన్నారు. రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ జేకే వెంకుబాబు, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ సెక్రటరీ బగాది భాస్కరరావు, సింహాభట్ల వంశీ, చైతన్య పాల్గొన్నారు.